కోరికల సత్యం

శ్రీ బలివాడ కాంతారావు

ఈ చివరిదశలో గత జీవితంలోని ఘట్టాలు తలుచుకుంటుంటే యివన్నీ నిన్నా మొన్నా జరిగినట్లే వున్నాయ్ రామయ్యకు.

సరిగ్గా ముప్పయియేళ్ళ క్రితం చిన్న చిరిగిన పంచె, మాసిన లాల్చీతో పొట్ట చేతపట్టుకొని యీ పట్నంలో అడుగు పెట్టాడు. వారంరోజులు పాదాలు అరిగిపోయినట్లు తిరగాతిరగ్గా ఒక కంట్రాక్టరు దగ్గర రోజుకి అరణాలమీద పనికుదిరింది. ఇదే చాలని సంతోషించాడు. అంతా స్వంతం అనుకొని పట్టుదలతో పనిచేసేవాడు.

ఒకనాడు వూరిబయట యెండప్పుడు మర్రిచెట్టు క్రింద మిగతా వాళ్ళతో మేనువాల్చి ఎండనక, వాననక యిలా నలిగిపోయే యీ మేస్త్రీ ఉద్యోగం కంటె మేనేజరు ఆఫీసులో గుమస్తా వుద్యోగం లభిస్తే యెంత బాగుండేదని కోరుకున్నాడు. ఆయన పనితనానికి మెచ్చుకున్న మేనేజరు ఆ కోరిక కొనసాగించాడు.

తన తెలివితేటలు వినయ విధేయతలు, కంపెనీకి లాభం చూపించే క్రొత్త విధానాలు — అసలు కంట్రాక్టరుకే చూపించే అవకాశం కలిగింది. తను మేనేజరుకంటే తెలివైనవాడినే తనెందుకు మేనేజరు కాకూడదనుకున్నాడు. ఆ కోరిక ఫలించడానికి నాలుగేళ్లయినా అవసరం లేకపోయింది. ఈలోగా ఆ పదవికోసం తనెంత ఆరాటపడి పోయాడు!

అది వచ్చాక లాభాలు కుప్పలుగా కురుస్తుంటే తనే కంట్రాక్టరు అయితే యెంత బాగుండేది అనిపించింది. కారు— మేడలు మిద్దెలు— పిల్లలకు పెద్ద చదువులు అమ్మాయిలకు పెద్ద సంబంధాలు!

ఆ కోరిక ఫలించడానికి యెన్నో సంవత్సరాలు పట్టలేదు. యజమాని తనకంపెనీలో చిన్నవాటా యిచ్చాడు. ఆవాటా రానురాను పెంచి కొన్నాళ్ళకు పటుతరమైన విశ్వాసంతో కంపెనీ వ్యవహారాలన్నీ తనమీద విడిచిపెట్టి దూరదేశాలకు సంచారం వెళ్ళిపోయాడు. రామయ్య తనవంతుకు వచ్చే లాభంతో మేడకట్టించాడు— కారు కొన్నాడు. పిల్లలు కాలేజీకి కారుమీద వెళ్తారు. తనకు యిప్పుడు దొరికే మిత్రుల బంధువుల అంతస్థులే వేరు.

ఫాషన్లూ, తిండీ అన్నీ మారిపోజొచ్చినయ్. యిప్పుడు భోజనం టేబిలుమీద చెయ్యవలసివస్తోంది. కారుంటేగాని కాలుకదలకుండావుంది. కంట్రాక్టరు తిరిగివచ్చేసరికి తనే ఆకంపెనీ అంతటికీ అధినాథుడు అయిపోయాడు. పెద్దకంట్రాక్టర్లు తనను యేవో మీటింగులకు పిలిచి సభామర్యాద చేస్తున్నారు. పనేమిరా పైకికాదన్నా తనేదో మహాదాత అని పొగిడి పొగిడి పుస్తకాల్లో యెక్కిస్తున్నారు. తన పేరుమీద వూళ్లో గ్రంథాలయం లేచింది. హైస్కూలుభవనం కూడా తన పేరుమీదే కట్టిస్తున్నారు. తను పెద్దనాయకుడై పోయాడు. కౌన్సిలరునుంచి మ్యునిసిపల్ చైర్మన్ అయికూర్చున్నాడు.

అందివచ్చిన పెద్దకొడుకు అంతా చూసుకుంటున్నాడు. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ తను పెట్టడమే. చూస్తూండగానే బటలమిల్లు, రెండుధాన్యం మరలు, ఉప్పుగల్లీ...అన్నీ తనపేరనె లేచిపోయాయి. ఇవన్నీ వృద్ధిఅవుతున్నకొద్దీ తనలో దయాధర్మగుణాలు పెరిగిపోయాయి. యెప్పుడూ యెవరికి యేమి యిద్దామా అనే వుబలాటమే!

జ్వరంతో పడుకున్న తనకు ఈనాడు యింకో కోరిక కలిగింది. కానీ ఆకోరిక కొనసాగదన్న నగ్న సత్యం యింకోకోరికకు దారితీసింది! తనమీద రోజులన్నీ కూడి, సంవత్సరాలై వేగంగా ముసలితనాన్ని ప్రసాదించాయ్! ఆరోగ్యం క్షీణించింది. ఈ గడ్డంలో నీరసించిన తనను కొద్దినెలలక్రితంవున్న రామయ్యఅని

పోల్చుకోలేరే! అంలాటిది తన్ను చాలా కాలం బ్రతకాలంటే ఆకోరిక కొనసాగుతుందా !

కాదు కాబట్టే తనకింకో కోరిక కలిగింది. తన చేతులతో దానధర్మాలు చేసాడు. తను చచ్చిపోయినా కలకాలం నిలిచిచే కీర్తి గౌరవం ప్రజల్లో విడిచి పోతున్నానని గుండెమీద చెయ్యి వేసుకొని ధీమాగా, తృప్తిగా చెప్పగలడు. తను దాతఅని, తనను కర్ణునితో పోల్చినకవులు లేకపోలేదు. ఎందరు కీర్తించలేదు. ఉవ్విళ్ళూరిపోతున్న రామయ్యలో తను ప్రజల్లో మారు వేషంలోతిరిగి తనపైనున్న గౌరవ ప్రతిష్ఠలను కళ్ళారాచూసి, చెవులారావిని, మనసారా సంతోషించి కళ్ళుమూద్దామనేకోరిక నిమిషనిమిషానికి బలీయమై మనస్సులో గాఢంగా పాతుకుపోయింది.

కొద్ది రోజుల్లో యెవరికీ తెలియకండా దానికి కావలసిన సరంజామా సంపాదించుకున్నాడు. ఒంట్లో నాలుగు ఫర్లాంగులు నడవగలిగే శక్తి చేకూరింది. ఎవరూ తన దగ్గరకు వచ్చి అట్టే విసిగత్తించ వద్దని ఆవేళనుంచీ చెప్పేసాడు. ఇల్లు ఎల్లప్పుడూ పిల్లలూ వాళ్ళ స్నేహితులు, బంధువులతో కళకళ్ళాడుతూ నిత్యకళ్యాణం పచ్చతోరణంలా వుంటుంది. కానీ యేరోజైతే అంతాయేదో విషయంలో నిమగ్నులై వుంటారో ఆరోజే పెరటి త్రోవగుండా యెవరికీ తెలియకుండా వెళ్లి తిరిగి వచ్చాక అందరినీ ఆశ్చర్యం పొందేటట్లు చేద్దామనుకున్నాడు. తను ఆనందంతో తిరిగి వచ్చేసరికి అందరూ తను అడుక్కునే వాడని యెంత గాఅడుగుతారో అప్పుడు జరిగే గమ్మత్తు నవ్వు అంతా వూహించి ఆనంద పడ్డాడు!

ఆరోజు వచ్చింది. చీకటిపడింది. ఇంట్లో వాళ్ళంతా మూడో అంతస్థుమీదకు పోయారు. తన చిన్నకూతురి సంబంధం కోసం కాబోయే వియ్యాల వారొచ్చారు. వాళ్ళ గౌరవార్థం పెద్దపార్టీ, పార్టీ అయ్యాక భరతనాట్య ప్రదర్శనం జరుగబోతుంది. తను యెలాగో కష్టపడి దిగువనుంచి, చివరి అంతస్తుకి ప్రాకగలడు. కానీ తను నీరసంగా వున్నానని రాలేనని అందరినీ పంపించివేసాడు. పరిస్థితులన్నీ అనుకూలంగానే వున్నాయ్. కానీ ఆకాశం అంతా కారు మబ్బుల మయమై వుంది. అయినా యింత వేగిరం వర్షంవచ్చే చిహ్నాలేమీ కనపడలేదు. "ఇంతికంటె మరి అవకాశం దొరకదు. వీళ్ళెవరైనా చూస్తే నన్ను కదలనివ్వరు. వర్షంవచ్చేలోగా తిరిగి రాలేనా?" అన్న ధీమాతో గబగ"-బట్టలు మార్చాడు. ఎదురుగా వున్న నిలువుటద్దంలో తన వేషం చూసి తనే ఆశ్చర్య పోయాడు. అచ్చంగా ఓగతిలేని ముసలి బిచ్చగాడు! గాలేస్తే పడిపోయేట్లున్నాడు!

ఇటూ అటూ యెవరూ లేకపోవటం చూచి ఒక్కసారి చాటుగా పెరటితలుపు తీసి రోడ్డుమీద పడ్డాడు. చేతికర్రతో నడ్డివంచినడుస్తూ అలా గబగబ వెళ్లిపోతున్న ఒక వ్యక్తితో.

"బాబూ!"

వెంటనే ఆవ్యక్తి "యేంలేదుపోరా!" అన్నాడు. రామయ్యకు ఒక్కసారి ఒళ్ళు మండింది. కాని వెనువెంటనే శాంతించి వెంటబడి:

"బాబూ! ఈ వూరు రావటం యిదే తొలిసారి, ఆ మేడమీద సందడిగా..."

తనమాటలు పూర్తికాకండానే "ఉంటుందిలే! వాడి మేడమీదలేక యింకెవరి మేడమీద ఉంటుంది?"

"ఏం బాబూ?"

"ఎందరో తిండిలేక చస్తుంటే వాడింట్లోవున్న పిల్లికి కూడా పుట్టినరోజు పండుగచేసి డబ్బు తగలేస్తారు!"

"ఎవరుబాబూ ఆయన!"

"రామయ్య అంటారులే..."

"ఆ బాబా? మా వూరివేపు ఆ బాబంటే దర్మదాతంటారు?" ఆ వ్యక్తినవ్వి "వాడి పేరుపెట్టకుండా అచ్చు గుద్దకుండా యెవరికైనా ఒకగుడ్డ దానంచేసాడా ఒక స్కూలు కట్టించాడా? నీకేం తెలుసు వాడి సంగతి?—ఒంటిగా వుండేటపుడు చెయ్యిచాపు ఒక దమ్మిడీ విసుర్తాడేమో? పదిమందిలో వుండగా చెయ్యిచాపు పది రూపాయల కాగితం విసుర్తాడు! దోస్తున్నాడు. ఆ పాపం కప్పుకొనడానికీ దానాలు. మనం పిచ్చివాళ్లం కానీ వాడు పిచ్చివాడుకాడు ముసలోడా?"

అంటుంటే రామయ్యకు నోరు పెగల్లేదు. అలా రోడ్డుప్రక్కన కూర్చుండిపోయాడు. ఆ వ్యక్తి ముందుకు వెళ్లిపోతుంటే వీధిదీపం వెలుతుర్లో చూసాడు. ఇంకెవరూ కాదు, తన దయాధర్మ గుణాన్ని నిండు సభలో పొగిడినవ్యక్తే యితను!

కొంతసేపయ్యాక లేచాడు. అలా నడిచిపోతున్న

వాళ్లెందరినో చూసాడు. ఎవరినడిగితేయేం చెడ్డచెప్పి పోతారోనని గుండె బితుకు బితుకుమంటోంది. ఈ వూర్లో అడుగు పెట్టిన దగ్గరనుంచీ పరిచయంవున్న వాని యిల్లు చూడగానే నడుస్తూ యెంతోదూరం వచ్చేసానని గుర్తుకు వచ్చేసింది.

ఆ వ్యక్తి భోజనం అయ్యాక వాకిట వాలుకుర్చీ వేసుకుని కూర్చొని పద్యాలు వల్లించుకుంటున్నాడు. ఎన్నిసార్లు యితను తనను సన్మాన పత్రాలలో ఇంద్రుడూ, చంద్రుడు అని పొగిడాడు. ఈయనకవి—ప్రజాహృదయానికి ప్రతినిధి—యీయన నోటనా కీర్తికాంతను వర్ణించగా విని హాయిగా తిరిగిపోతాను. అట్టేదూరం నడవలేనేమో? ఏబండివాడు యీ బిచ్చగాడికి బండికట్టడానికి ఒప్పుకుంటాడు? అయ్యో! ఈ చింకిజేబూలో ఒక రూపాయైనా వేసుకోచ్చాను కాదే?"

తన కంఠస్వరం యెంత మాత్రం పోల్చుకో కూడదని వణుకుతూ "బాబూ!" అన్నాడు.

తన వేపు చూడకండానే "భోజనాలయిపోయాయ్. పోనోయ్!" అన్నాడు.

"బాబూ! ఈ వూరిలో కాలుపెట్టడం యిదే... ఎవరో రామయ్య బాబట! అడగని వాడిదే పాపమట! ఆ మారాజు పేరు దేశమంతా మ్రోగతిన్నాది—ఆ యిల్లెక్కడో సెప్పరా?"

ఈ మాటలతో ఆయన తలొకసారి త్రిప్పి పక్కన నవ్వాడు. కొద్దిగా ఆయాసంగా వుండటం వలన రామయ్య అక్కడ కూర్చుండ బడిపోయాడు.

ఆకాశాన నల్లని మేఘాలు ముద్దుగా పేరుకుపోతున్నాయ్. ఉండి వుండి చల్లని గాలి వీస్తోంది. ఆ వ్యక్తి ఒక్క ఆవులింత తీసి "ఆ రామయ్య సంగతా? వినాలని వుందా?"

"సిత్తం!"

"వాడు యిప్పుడు దేవేంద్ర భోగం అనుభవిస్తున్నాడని అంతా అనుకుంటాగుగానీ యీ వూరు చింకి బట్టలతో వచ్చిన క్రొత్త రోజుల్లోవున్న సుఖం వాడికేదీ? నిజం చెప్తాను తాతా నీలాంటి సుఖమైన మనిషి లోకంలో యెక్కడా వుండడు, ఎందుచేతనంటావ్—నీకు కోరికల్లేవు. కావలసిన బట్టా తిండీ అడుక్కొని ఆ అవసరాలు తీర్చుకుంటావ్? వింటున్నావా? అర్థం అయిందా?"

"ఆఁ..." మూలిగాడు.

"ఆ రామయ్యే యెండనక వాననక కష్టపడి అదిగో చూసావా ఆ కనుపించే మర్రిచెట్టు క్రింద హాయిగా పడుకొనేవాడు. ఆ రోజుల్లోనూ నేను వాడిని యెరుగుదును. ఎంత మంచి మనిషంటావ్? తను యేకీర్తీ కోరకండానే ఒకరికి సహాయం చేసేవాడు తను బాధపడి కూడానూ...మరి యిప్పుడో...వాడికి యేపని చేసినా, చివరికి నీకో కానీ ధర్మంచేసినా కీర్తి కోరే చేస్తున్నాడు. అంచేత మనిషిగా ఒక విలువను సంపాదించినవాడు, ఆనాటిరామయ్యకానీ యీనాటి రామయ్య యెంతమాత్రం కాదు! నేనేదో పెద్దమాటలు అనేస్తున్నాను—అర్థమౌతోందా?"

కళ్ళపర్యంతరం నీరు తెచ్చుకున్న రామయ్య "ఊఁ" అని విధిలేక గొణిగాడు.

అతను హృదయాహ్లాదానిచ్చే గాలి వీస్తుంటే వునికి మరచిపోయి తను మరుగుపరచుకున్న వ్యక్తిత్వాన్ని వెల్లగక్కుతున్నాడు.

"ఈలోకంలో బాగా మోసపోయేవాడెవడంటే రామయ్య అంటాను! ఒకమాటంటాను; లోకం చూసావు; న్యాయం చెప్పు! ఆకలని వచ్చావ్. కడుపునిండా తిండేకాదు మంచి బట్టలిచ్చాను. మాయింట్లోమనిషిగా చూసుకున్నాను. నమ్మి యింటిపెత్తనంయిచ్చి పనిమీద వూరికి వెళ్ళాను. నేను తిరిగి వచ్చేసరికి దొంగలెక్కలతో యీ యిల్లూ ఆస్తీ అంతా నాదేనన్నావు. చూసావా? ఇంతచేసినందుకు పదునైన కత్తితో వెనుకనుంచివచ్చి పొడిచి చంపినట్లు లేదూ? ఆశతో రాక్షసుడైపోయాడు రామయ్య! రాక్షసుడు కంపెనీ కబళించుకున్నాడు? ఎన్ని కార్లు, ఎన్ని మేడలు, ఎన్ని లక్షలున్నా, ఎన్ని దానాలుచేసినా రాక్షసుడు సత్యం న్యాయంకి చిహ్నమైన మనిషెలా అయిపోతాడు చెప్పు? ఇలాంటిహీనుడు ప్రజల్లో గొప్పవానిగా యెలా చెలామణిఅయిపోతాడు? ముఖస్తుతికి పొంగి వుబ్బిపోయేవాడు, వుత్తి నీచుడన్నమాట! తన నీచత్వం తను తెలుసుకుంటాడని తనని యింద్రుడు చంద్రుడని నేనే పొగిడినవాడు వుబ్బి తబ్బిబ్బయిపోయాడు! తనలాంటి రాక్షసుడు, యింద్రుడు, చంద్రుడెలాగౌతాడనైనా ఒక్షణమైనా ఆలోచిస్తే యీ భాగ్యభోగాలు విడిచి తనతప్పులకుపశ్చాత్తాపం చెంది యే అడవుల్లోనో కష్టాలు పడి తాపసిగా వుండిపోను. చూసావా! కోరికలతో

యెన్నో నోములు నోస్తేగానీ దొరకని నరజన్మని ఎలా నాశనం చేసుకున్నాడో? చేసినపాపానికి ఫలితం అనుభవిస్తాడులే!"

ఈ మాటలు ములుకుల్లా గుండెకు నాటడంవల్ల బాధతో వేజారెత్తి ముందుకు పరిగెత్తాడు. నడుస్తుంటే కాళ్లు వణికిపోతున్నయ్. కళ్ళు చీకట్లు కమ్ముతున్నయ్. మనసు గురితప్పి గమ్యంలేక రోడ్డుదిగి నడుస్తున్నాడు. చీకటి...దారీ తెన్నూ అగపడలేదు. భూతంలా మర్రిచెట్టు అగుపిస్తోంది.

ఉరుములు మీదే పడుతున్నట్లున్నయ్. భయం-భయంకరంగా వుంది—ఎవరో తనవెంట నీడలా నడుస్తూ నడుస్తూ వున్నట్లు...తిరిగి చూడడానికి భయం వేసింది. వికటాట్టహాసం! ఆ భయంకరమైన కోరలు! చేతులలో తన్ను కౌగలించుకోడానికి వస్తున్న... పిశాచా?... యమకింకరుడా?

అదిగో తనలోనికి చొచ్చుకుపోయినట్లున్నాడే లోపల నవ్వుతూ కడుపు చెక్కలు చేస్తున్నాడు... "హా హా..." ఏదో అంటున్నాడు...ఏమిటది? వినకూడదని చెవులు మూసుకున్నా గట్టిగా వినిపిస్తోంది....

"అమాయకుడా! దేముడు కోరినదానితోపాటు కోరనిది కూడా యిస్తాడు. కీర్తి కోరితే అపకీర్తికూడా మేళవిస్తాడు—సుఖాలు కోరితే కష్టాలు కూడా జత పరుస్తాడు — ఈ మాత్రం సత్యం తెలుసుకోలేకపోయావ్ ..."

ఒక్క మెరుపు మెరిసింది! త్రోవలో రాళ్లి రప్పలు చెల్లాచెదురుగా అగుపించాయ్...తరవాత ఆ ప్రదేశమంతా నిశిలో శ్మశానంలా వుంది. ఈనిర్జన ప్రదేశానికి యీ భీభత్సమైన వాతావరణంలో యెందుకు యెలా వచ్చానని ఆశ్చర్యపోయాడు. బహుశః ఆ మర్రిచెట్టుకీ తన జీవితానికీ వుండే బంధం తననిలా లాగుకొని వచ్చిందేమో! పట్టపగలు వచ్చి వుంటే యెంత బాగుండేదని విసుక్కున్నాడు. పెనుగాలితో పెద్ద వర్షం దబదబ వచ్చిపడింది. ఉరుములు మెరుపులతో భూమి దద్దరిల్లిపోతోంది. ఆతృతతో కర్ర పట్టుకొని వంగుతూ రక్షణకోసం మర్రిచెట్టు వేపు నడవబోయాడు. గాలికి చెట్టుకొమ్మలన్నీ వూగుతూ పెద్దశబ్దం చేస్తున్నయ్. తను ఆ చెట్టు క్రిందకు పోతే యే కొమ్మ విరిగిపడ్తే తను చచ్చిపోడూ? ఏ పాముచేరి కరిస్తే తను గిజగిజ గింజుకొని ప్రాణం విడిచిపెట్టడూ?

"అయ్యో! నా మేడలో హాయిగా వుండక యిలా యెందుకొచ్చాను? పరుగెత్తి వెనక్కిపోతాను-రోడ్డుమీదకువెళ్తే...ఈ సరికి నాకోసం కార్లమీద వూరంతా గాలిస్తుంటారు. నన్నీ వేషంతో చూసి నేను రామయ్యనంటే నమ్ముతారా? నా కారు నన్ను యెక్కనిస్తారా? అసలు నేను రోడ్డువరకైనా వెళ్లలేనే...నా గుండె ఆగిపోతున్నట్లుంది! దేముడా నన్నిక్కడ చంపకు...."

కాళ్లు ముందుకు పడటంలేదు తడిసి ముద్దయి వణుకుతూ ఆశతో "అదిగో నా మేడలూ మిద్దెలూ... నా పెళ్లాం, పిల్లలూ...వాళ్లంతా కళ్లకు కనిపిస్తుంటే చూస్తూ చచ్చిపోతాను...ఈ భీభత్సంలో నేను చేసిన దానధర్మాలూ పుణ్యమైనా నాకు తోడు రావా? ఇంటికి చేర్చు-అక్కడ చచ్చిపోతే నా శవం వెంట వూరంతా వస్తారు—బ్యాండు మేళం మోగుతుంది ..... దేశం అంతా కన్నీరు విడుస్తుంది ..... నాకిక్కడ గతిలేనిచావు యీ వేషంలో తీసుకురాకు తండ్రీ!" వలవల యేడుస్తూ తల బాదుకున్నాడు. కాలు ముందుకుపడలేదు. చలికి గజగజ వణికిపోతున్నాడు. ఆకాశం దద్దరిల్లిపోతోంది. వర్షం కుండలతో కురుస్తోంది. గాలి ఘీంకారం! ఢబేల్ మని మర్రిచెట్టు కొమ్మ కూలిపోయింది. రామయ్య త్రుళ్ళిపడి ఒక్క యెగురు యెగిరాడు! ఆయెగురుతో నే ముందువున్న రాళ్లి మీద పడ్డాడు. నుదురు టకీమంది. ముక్కు బద్దలైపోయింది. ముఖం పచ్చడైంది. రక్తం కారుతూంది. "చచ్చిపోయాను బాబో..."— ఉన్న చివరిశక్తితో గట్టిగా కేక వేసాడు. ఆ కేకను ఉరుములు మ్రింగేశాయి. ఆ కన్నీటిని వర్షం కలుపుకుంది.

ఉదయం... "ఎవడో గతిలేని ముసలి బిచ్చగాని శవం" గా ప్రభుత్వపు ఖర్చుమీద దహనక్రియలు పోలీసువాళ్లచే జరుపబడ్డాయి.